# ఆడపిల్లల తండ్రి

## కథానిక

### చామర్తి దుర్గాప్రసాద్

ఆతను దాదాపు రెండు సంవత్సరాలు ఇంటికి, దేశానికి దూరంగా ఉన్నాడు. ఆ రోజుల్లో ఏకాంతాన్ని, ఒంటరితనాన్ని, దిగులునీ చంపడం తెలీక అనేక భాషల సాహిత్యంలో వస్తున్న తీరు తెన్నులు పరిశీలించాడు.

అగ్ని పర్వతాలు, అనంత సముద్రాలు, జెట్ విమానాలు, ఎడారుల నిట్టూర్పులు, ప్రళయాల గర్జనలు ఆ భాషల్లో వస్తున్నాయి.

అతనికి ఉద్రేకం వచ్చింది. కాగితం మీదికి కలం ఎక్కింది. ఇంటి నుంచి వచ్చిన ఉత్తరంలో విషాదమయిన ఆత్మహత్య చదవగానే అతనికి నిద్ర పట్టలేదు. నాలుగు రోజులు పెనం మీద వేగిపోయ్యాడు. ఆ సంఘటన నవల్లో పాత్రకి ఊపిరి పోసింది. ఆ తర్వాతే అతనికి నిద్ర పట్టింది.

మరోసారి టీ. వి. లో భారత దేశంలో వీధులు చూసి, అన్నం కోసం అలమటిస్తున్న అనాధల కడుపుల్ని చూసి, దరిద్రుల గుంపుల్ని చూసి స్నేహితులు "ఈ దురంతం ఎందుకు ఆపలేక పోయినారు – సిగ్గు వెయ్యడం లేదూ" అన్నప్పుడు, అతనికి తను తింటున్న ప్రతి రొట్టి ముక్కా ఎవరి దగ్గరి నుంచో తను కాజేశాననిపించింది. ఆ నవల్లో పాత్ర కది ఆహార మయింది.

వరద మూలాన జరిగిన బీభత్సం కోసం తాము పంపిన డబ్బు చేరవలసిన చోట్లకి చేరలేదని ఒక సంస్థ చేసిన ప్రకటన అతని దృష్టికి వచ్చినప్పుడు, తన ప్రజల అవినీతి పట్ల కోపమూ, అది సహిస్తున్న తనలాంటి వారిపట్ల అసహ్యమూ కలిగినై. తల ఎత్తుకొని తిరగలేకపోయాడు. కాగితం మీద ఆ అసహ్యం లావాలా ప్రవహించింది.

తన బాధలకి రూపకల్పన ఆ కాగితాలు. తన్ని బాధల నుండి కాపాడి ఓదార్చినవే ఆ కాగితాలు.

తన ఊపిరి, ప్రాణం, చేతన అవి.

ఈ నవలని కస్టమ్స్‌లో మర్చిపోయి ఎంత ప్రయత్నించినా దొరక నప్పుడు, అతనికి ఎంతో కావల్సిన ఆత్మీయుల్ని పోగొట్టు కున్నంత బాధ కలిగింది. అతని ముఖాన్ని చూసి 'కస్టమ్స్‌లో బాగా టాక్స్ వేశాడా' అని అడిగారు మిత్రులు "అంత డబ్బు మిగల్లేదేమో! డబ్బు తెచ్చి కారు కొందామను కున్నాడు. ధరలు పెరిగినై". ఇలా వెక్కిరించారు.

తన బాధ ఎవరికి తెలుసు?

ఇంటికి రాగానే పార్సెల్ ఎదురు చూస్తోంది. పదేళ్ల క్రితం ప్రచురిస్తానని తీసుకున్న ప్రముఖ సంస్థ తిప్పి పంపిన తన నవల. ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం రాసింది.

కష్టపడి పెళ్ళి చేసి పంపిన కూతురు గీత చెడి వచ్చి నంత బాధ కలిగింది.

ఆ పార్సెల్‌ని బీరువాలో పెడు తుంటే కనపడ్డాయి, ఎన్నో వ్రాత ప్రతులు – దిగులుగా కన్నె చెర విడి పించ మంటూ.

ఒక్కర్తెకూ పెళ్ళి చేయలేని తను మరో కూతుర్ని కనడం ఎంత పాపం!

ఆ పాపానికి ప్రాయశ్చిత్తం తను అనుభవించ వలసిందే.